# అభ్యుదయం

సరోజా హనుమంతరావు



వేం మాసం-మిట మధ్యాహ్నపు ఎండ.

దాహానికి తట్టుకోలేక చెట్లు నీడల్ని తాగేశాయో, తాపానికి తట్టుకోలేక నీడలే చెట్ల చాటున దాక్కున్నాయో తెలీని సమయం. నీడలేని ఓ రేకుల షెడ్డు క్రిందకి చక్రాలబండి లాక్కొచ్చి రొప్పుతున్నాడు సాములు.

"బేగి పదరా '....అవతల అయిదరా బాదు బస్సు టయమయిపోనాది" అని అరిచాడు చక్రాలబండిమీది కుంటోడు.

"ఒక్క టీ అన్నాకొట్టించవ్.... కళ్ళు తిరుగుతున్నాయి."

"నీకు గంటకోపాలి టీ కొట్టించడానికేరా కొడకా, నేనీ సెక్రాల బండెక్కి వూరేగుతున్నా. అగ్ని మెంటు పెకారం డూటీ దిగేదాకా టీ కొట్టించేది లేదు. ఆ మూల మున్సిపాల్టీవోడి పంపుంది. పొట్ట నిండా సల్లంగా నీళ్ళు పట్టించి బేగిరా. మల్లా బస్సు మిస్సయిపోద్ది...."

కుంటాడు మొండిచెయ్యి చూపించాడని అర్ధమయింది సాములుకు. కసిగా నుదుటి మీద చెమటను నేలకేసి విసిరికొట్టి బండి తాడు పుచ్చుకొని మళ్ళీ రోడ్డెక్కాడు. వెనక కుంటాణ్ణి మోసే చక్రాలబండి గరగరమంటూ వెంటబడింది.

ఏ మినిష్టరుగారికో పుట్టివుంటే ఎమిరికన్ కాన్వెంట్‌లో ఏబిసిడిలు నేర్చుకోవాల్సిన పసివయసు సాముల్ది. వాడెవడికి పుట్టాడో వాడికేగాదు వాడి తల్లికీ తెలియదు. తెలిసిందల్లా అనుక్షణం కడుపులో దేవే ఆకలి చిచ్చు. దాన్ని చల్లార్చుకొనేందుకు కోటి విద్యల్లో కొన్ని ....అందులో ఒకటే ప్రస్తుతం కుంటోడి చక్రాలబండి సారధ్యం.

కుంటోడి "కాళ్ళు" అవి వున్నప్పుడు కడుపులో ముడుచుకు పడుకొనేందుకు తప్ప యెందుకూ పనికిరాలేదు. రాజమండ్రి షావుకారు "కారు" పుణ్యమా అని చితికిపోయిన కాళ్ళకు కాంపెన్సేషన్‌గా దక్కిన చక్రాల బండెక్కి రథం మీద దేవుళ్ళా వెలిగిపోతున్నాడు ప్రస్తుతం కుంటోడు దేవుడి రథమైనా జీవుడు పూనుకోనిదే కదల్దు. కుంటోడి చక్రాలబండో లెఖ్ఖ!.... సాముల్లాంటి పసికూనల కడుపుల్లో 'ఆకలి నసే' లేకపోతే కుంటోడిలాంటివాళ్ళు బ్రతుగ్గడిచేదెలా ?!

అందుకే....

"దేవుడు దయామయుడు...." అన్నాడు కుంటోడు, అప్పటివరకు అయిన కలక్షన్లు లెక్కబెట్టుకుంటూ.

"ఛత్.... దేవుడు!.." అని తుపుక్కుని వుమ్మేసాడు సాములు కడుపుమీద కొట్టుకొని.

"కళ్ళుపోతాయిరా కుర్రాడ!"

"పోతే నీలాగే బాగుపడతారా ముసిలాడా...." అనుకుంటూ ఎదురుగా గంట మోగించుకుంటూ వచ్చేరిక్షాని గుద్దేశాడు.

"నీకిప్పుడే కళ్ళు పోయినాయేవిరా ఎదవా! ఏదో ఏక్సిడెంట్ సేసేటట్టున్నావూ.... సేతగాని పనికెందుకొప్పుకున్నావురా సచ్చినాడా!" అని కుంటాడరిచే అరుపులు సాములు చెవుల్లో దూరటమేలేదు.

బండి బస్టాండు దగ్గర పారేస్తే డూటీ

## మినీ కథా వీధి

అయిపోయినట్లే..ఇస్మాయిల్ 'హొటేల్లో' వేడివేడి పరోటాలు. టీ నీళ్ళు గుర్తొచ్చి జోరు పెరిగింది.

కష్టం మరిచిపోవటానికి పాటకూడా అందుకున్నాడు.

"రెండు కాళ్ళూలేవు నారాయనా
పండు ముసిలోణ్ణి నారాయనా
పయిసా ఒకటుంటే పారేయన్నా!"

సత్తు బొచ్చెలో రాలుతున్న చిల్లర లెక్కబెట్టుకుంటూ "సాకులాంటి కుర్రోడు. నాకే పిల్లుంటే అల్లుణ్ణి సేసేసుకుందు(నా పిల్లాడా " అని హుషారిస్తున్న కుంటోడికి వెనగా మలుపు తిరిగి విసురుగా వస్తున్న లారీ కనిపించింది బొయ్యి బొయ్యిమని హారన్ మోగిస్తూ.

సాములు కది వినిపిస్తుందా?

వాడికి పుట్టు చెవుడు.

ఆ సంగత్తెలీని కుంటోడు అరుస్తూనే వున్నాడు. సర్రుమని బ్రేకేసిన లారీ కరుగ్గా మీదెక్కిందాకా.

పారిపోయేందుకు పాపం కాళ్ళేవీ!....

* * *

"ఈ కథవల్ల నేనేం సాధించాను?"

ప్రముఖ పత్రికపెట్టిన కథానికపోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్న పై కథా రచయిత కామేశ్వర్రావు వూళ్ళోవాళ్ళు తనకుచేసిన సన్మానసభలో వూగిపోతూ

## పరిచయం



చెప్పుకొనేటంత గొప్పలేవీ లేవు

-కర్లపాలెం సరోజా హనుమంతరావు

(శ్రోతలను అలా ప్రశ్నించి తనే సమాధానం చెప్పుకొన్నాడు.

"సంఘం చీకటి కోణంలో తచ్చాడే మీ రెవ్వరూ పట్టించుకోని విధివంచితుల జీవన పోరాటాన్ని యథాతధంగా మీ ముందుంచి మెప్పుపొందటమే నేను సాధించిన విజయం. ఇది ఒక యధార్థగాథ. మన బెజవాడ గాంధీసెంటర్లో నిత్యం చక్రాల బండెక్కి అడుక్కునే కుంటిమనిషి, దాన్నిలాగే కుర్రాడిని చూసి రాసిన కథే....ఇది. సామాజిక స్పృహ వున్న యిలాంటి కథలు మరెన్నో రాసి 'అభాగ్యజీవుల అభ్యుదయం' కోసం కృషిచేయటమే నా ధ్యేయం...."

హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

కామేశ్వర్రావుకి కాశ్మీరు శాలువాతో పాటు "దీన జనోద్ధారక" బిరుదు. మనీ పర్సు ముట్టాయి.

సభ ముగిసిన తరువాత సతీసమేతంగా యింటికి వెళ్తున్న కామేశ్వర్రావుకు గాంధీసెంటర్లో గలభా వినిపించింది.

"మీ కథలో హీరోలు....!" అని డొక్కలో పొడిచి కిసుక్కున నవ్వింది అర్థాంగి.

కామేశ్వర్రావు కథలోని వుదాత్త పాత్ర 'చెవిటి కుర్రాడు" కుంటి మనలాణ్ణి పట్టుకు బాదేస్తున్నాడు.

కలక్షన్ పంపకంలో పేచీ.

వింత చూస్తున్న జనాన్ని తప్పించుకొని సొంత వ్యవహారంలా కుర్రాడి జబ్బ పట్టుకొన్నాడు కామేశ్వరరావు. "వాడి అవిటితనాన్ని జనానికి చూపించి అడుక్కున్న డబ్బులు వాడికివ్వకుండా కాజేయటానికి సిగ్గులేదూ!"

కుర్రాడు బిగ్గరగా నవ్వాడు.

"మీరా కతలబాబూ! అప్పుడెప్పుడో ఓపాలి కనీసం టీ నీళ్ళైనా పోయకుండా ఆ కుంటోడి ఇవరాలన్నీ అడుక్కొని ఎల్లారు. కత రాసుకొని ఎయ్యిరూపాయిలు బహుమానం కొట్టేశారుకదా, కుంటోడికి వాటా పెట్టారా! ఆడి కుంటితనాన్ని సూపించి నేనడుక్కుంటే, ఆడి కుంటితనాన్ని రాసి మీరు అడుక్కోటంలా? నాకా సెప్పుకొస్తున్నారూ!"

కామేశ్వర్రావు వంచిన తలెత్తకుండా వెళ్ళి రిక్షాలో కూర్చున్నాడు. ఇంటికి వెళ్ళిందాకా మళ్ళీ మాట్లాడలేదు.


రీటాతో కేశ సంపద



జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తీ, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికీ, నల్లదనానికీ, దానికదే సాటి.

రీటా వాడి. మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.




# రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును

స్త్రీలూ పురుషులూ వాడతగ్గది

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.